క్లుప్తంగా

హుస్సేన్‌నాయక్‌కు వినతి



గార్ల: మండలంలోని అంజనాపురం ఎత్తిపోతల పథకం మరమ్మతుకు నిధులు మంజూరు చేయించాలని కోరుతూ సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను అంజనాపురం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు బానోత్ సంపత్‌నాయక్, బానోత్ లక్ష్మణ్‌నాయక్, సాయికుమార్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దోర్నకల్: భారీవర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఇమ్మానియల్ విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భారీ వర్షాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్, విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, సీఐ బి.రాజేష్, విద్యుత్‌శాఖ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: భారీవర్షాల సూచన కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద నరేష్ సోమవారం మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాగులు, చెరువులు దాటి ఎవ్వరు ప్రయాణం చేయొద్దన్నారు. అత్యవసర సమయాల్లో 63090 30286 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన సత్యవతిరాథోడ్



దోర్నకల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయంగా దోర్నకల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై కేటీఆర్‌తో చర్చించారు. బీఆర్ఎస్ నాయకుడు మన్యుపాట్ని ఉన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయ ప్రత్యేక అధికారిణి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 15సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల బాలికలు మంగళవారం స్పాట్ అడ్మిషన్లను పొందాలని, సమాచారం కోసం 70133 63069 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



నెల్లికుదురు: మండలంలోని పార్వతమ్మగూడెం గ్రామంలో అధిక లోడు ఉండటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండు దఫాలుగా కాలిపోయిందని నెల్లికుదురు విద్యుత్ ఏఈ సిందూ అన్నారు. సోమవారం వర్షంలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి రైతులకు విద్యుత్ అందించినట్లు ఏఈ తెలిపారు.

నీట మునిగిన పంట పొలాలు



గూడూరు: మండలంలోని భూపతిపేట నుంచి సీతానగరం, పర్యాటక కేంద్రం భీమునిపాద జలపాతానికి వెళ్లే ప్రధాన రహదారిలో 15రోజుల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగాయి. కానీ బ్రిడ్జి స్లాబ్ కింద మట్టి నింపి తొలగించకపోవడంతో సోమవారం భారీ వర్షం కారణంగా బ్రిడ్జి కింద నుంచి నీరు పోలేక నాటు పడిన సుమారు 20ఎకరాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతూ, అధికారులు, కాంట్రాక్టర్ వెంటనే స్పందించి స్లాబ్ కింద మట్టిని తొలగించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బానోత్ యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం మండల డీలర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. డీలర్లు బానోత్ చత్రు, బోనగిరి నారాయణ, వీరమల్ల జైహింద్, వీరమనేని రమేష్, నాసం మధుసూదన్, కొడిశాల బాబు, వీరమల్ల జైహింద్, రావుల భీమన్న, ఏలూరి యాకన్న తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రోడ్లు అధ్వానం

అదుపుతప్పితే.. అంతే



గుంటిచెరువు కట్టసమీపంలో ప్రమాదకరంగా రోడ్డు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని గుంటిచెరువు కట్ట మీదుగా వెళ్లే మార్గంలో, కట్ట చివర ఉన్న కల్వర్టు వద్ద ఇరువైపుల మట్టి కుంగిపోవడంతో, రోడ్డుమార్గం వంకలు తిరగడంతోపాటు, ఇరుకుగా మారింది. నిత్యం ఇనుగుర్తి మండల కేంద్రం మీదుగా లాలుతండా, మేచరాజ్‌పల్లి, అన్నారం వైపు రాకపోకలు సాగించే, పలు వాహనాదారులు ఆ మూలమలుపు వద్దకు రాగానే జంకుతున్నారు. అధికారులు ఈ మార్గాన్ని సరిచేసి, రోడ్డును వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బురదమయం..



కురవి: మండలంలోని నల్లెల్ల శివారు సూర్యతండాలో తులిశానాయక్ కాలనీలో అంతర్గత రోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో కాలనీలోని రోడ్డు చిత్తడిగా మారింది. రోడ్డుపై నడుస్తుంటే జారిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ఈ కాలనీలో ఉన్న బురద రోడ్డును సీసీ రోడ్డుగా మార్చి బాధలను తీర్చాలని వేడుకుంటున్నారు.

కట్టదారే ప్రధాన మార్గం



బురదమయంగా అయోధ్య బీటీ రోడ్డు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామ పరిధిలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి రెండున్నర ఏళ్లు కావస్తున్నప్పటికీ అవి జాప్యంగా కొనసాగుతుండడంతో రైతులు, వాహనదారులు నానా అగచాట్లు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యవసాయ పనులకు, మానుకోట పట్టణానికి వెళ్లాలన్నా పెద్ద చెరువు కట్టదారే ప్రధాన మార్గం. వర్షాకాలం ప్రారంభమై ప్రస్తుత మట్టిరోడ్డు బురదమయంగా మారిపోయింది. అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్టీ సత్తా చాటాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అరిపిరాల, కర్కాల గ్రామాల ఎంపీటీసీ క్లస్టర్ పరిధిలో కార్యకర్తల సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేపడుతూ అవినీతి రహితపాలన అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జాటోతు హమ్యానాయక్, సుంచు సంతోష్, జాటోతు నేహ్రునాయక్, చాపల బాపురెడ్డి, పింగిళి ఉషా, మేకల కుమార్, పెద్ది ప్రవీణ్‌గౌడ్, డాక్టర్ సోమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తొర్రూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తిని తన భార్య మందలించిందని మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన డివిజన్ కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం పట్టణానికి చెందిన తాలికొండ సర్వేశ్వర్‌రావు (42) అనే వ్యక్తి కొన్నినెలలుగా మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్య నాగమణితో గొడవ పడేవాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి మరోసారి మద్యం తాగివచ్చి భార్యతో గొడవ పడి, అర్ధరాత్రి సమయంలో నిద్రిస్తుండగా, పక్క గదిలోకి వెళ్లిన సర్వేశ్వర్‌రావు చీరతో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

పెద్దవంగర: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన పునాది వేస్తుందని అడిషనల్ డీఆర్‌డీఓ పుల్లూరి శ్రీనివాస్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబురాల్లో భాగంగా సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో ఇంటింటికి ఇందిరమ్మ సంఘం బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పలు మహిళా సంఘాల నాయరాళ్లు ఇంటింటికి పూలతో వెళ్లి బొట్టుపెట్టి మహిళా సంఘాల్లో చేరాలని ఆహ్వానించారు. ఈ విజయోత్సవ వేడుకల్లో అదనపు డీఆర్‌డీఓ పాల్గొని మాట్లాడారు. కోటిమంది మహిళలను కోటీశ్వర్లను చేయాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేట్టిందని తెలిపారు. 18ఏళ్ల నుంచి 59 ఏళ్లు ఉన్న మహిళలు మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణా చారి, సీసీలు సుజాత, సుధాకర్, నిత్యానంద, సోమేశ్వర, వీఓలు అనిత, యాకయ్య పాల్గొన్నారు.

కలప తరలిస్తున్న వాహనం సీజ్

కొత్తగూడ: కొత్తగూడ మండలం నుంచి నల్లబెల్లి ప్రాంతానికి అక్రమంగా టేకు కలప తరలిస్తున్న బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్వో వజరహత్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అక్రమంగా కలప తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు.

లారీలు ఢీ.. పలువురికి గాయాలు



నుజ్జునుజ్జు అయిన లారీలు

తొర్రూరు రూరల్: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన మండలంలోని మాటేడు గ్రామ శివారులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వస్తున్న లారీ ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను తప్పించబోయి ఖమ్మం నుంచి వరంగల్ వైపు వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. దీంతో లారీల ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. డ్రైవర్లలో మహారాష్ట్రానికి చెందిన సోహన్‌సింగ్‌కు రెండు కాళ్లు విరగగా, మిగిలిన డ్రైవర్, క్లీనర్లకు తలలకు, కాళ్లకు సైతం స్వల్ప గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించారు. ప్రమాదానికి కారణమైన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో లారీ డ్రైవర్ కమలేంద్ర యాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

గార్ల: గార్లలోని పాండవుల దేవాలయంలో సోమవారం పాండవులకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పాకాల ఏటి నుంచి జలబిందెలతో జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించి నైవేద్యంగా వరదపాశం సమర్పించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా వర్షాకాలం ప్రారంభంలో పాండవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈఏడాది వర్షాలు వర్షాలు కురవాలని ముదిరాజ్ కులస్తులు జల బిందెలను ఎత్తుకోగా, నృత్యాలు చేసుకుంటూ పాకాల ఏటికి వెళ్లి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పుల్లఖండం రమేష్‌బాబు, హతీరాం, తోడేటి శ్రీనుగౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు పందుల వీరస్వామి, పందుల నారాయణ, వీరేశం, అడిగెల శ్రీనివాస్, కుంట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మరిపెడ రూరల్: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయల రవి, బోడ సోమ్లనాయక్, జినక ఉపేందర్, బాలు పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ

కురవి: మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ సోమవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. తనిఖీలో పైలట్ క్రాంతికుమార్, ఈఎంటీ రవికుమార్ పాల్గొన్నారు.

ఖర్గే జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ రూరల్: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రంగౌడ్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు చెన్న సీతారాములు, రామచంద్రు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

నివాళి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన డీఎస్పీ కొండం పార్థసారథి మాతృమూర్తి కొండం అనసూర్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. సోమవారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అనసూర్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరామర్శ..

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం, గోపాలగిరి, తొర్రూరు గ్రామాల్లో ఇటీవల అనేక కారణాలతో మృతి చెందిన కుటుంబాలను తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి సోమవారం పరామర్శించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం..

- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



పెద్దవంగర: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: ప్రజలకు సులభంగా ప్రాథమిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.1.43 కోట్ల నిధులతో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణానికి దాతలు జాటోతు నెహ్రునాయక్, కేతిరెడ్డి సోమనర్సింహ రెడ్డి, పాలకుర్తి యాదగిరి రావు, అనబత్తుల ప్రభాకర్‌రావు, చెరకు మహేశ్వర్ రెడ్డి, అన్నబత్తుల నాగేశ్వర్‌రావు, ముప్పాల సరేష్ బాబు, పసులేటి వెంకట్రామయ్య భూమిని విరాళంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవి రాథోడ్, తహసీల్దార్ మహేందర్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు జాటోతు నెహ్రునాయక్, నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు, బీసు హరికృష్ణ పాల్గొన్నారు.

తొర్రూరు: రేషన్‌షాపుల ద్వారా నిరుపేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు జానోతు హమ్యానాయక్, సుంచు సంతోష్, మేకల కుమార్ పాల్గొన్నారు.

గర్వించదగ్గ నాయకుడు మంద కృష్ణ



మాట్లాడుతున్న దేవేంద్ర ప్రసాద్

మహబూబాబాద్ అర్బన్: జాతిని జాగృతం చేయడంలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల పాత్ర కీలకమని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి మాదిగ ఉద్యోగ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దేవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మాదిగ జాతి గర్వించదగ్గ ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాన్ని విజయతీరాలకు చేర్చి, ఎస్సీ వర్గీకరణ లక్ష్యాన్ని సాధించి, ఆ ఫలాలు మాదిగ జాతి బిడ్డలకు మంద కృష్ణ అందించారన్నారు. ఉద్యమ ప్రస్థాన కేంద్రంగా జాంభవ భవన నిర్మాణం జరుపుకుంటున్న సందర్భంలో అందుకు మాదిగ ఉద్యోగులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య, రాష్ట్ర నాయకులు దిలీప్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహంకాళి బుచ్చయ్య, జిల్లా అధ్యక్షుడు దోసపాటి మల్లయ్య, జలగం వీరస్వామి, దైద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాకాల ఏటి కింద ముమ్మరంగా వరినాట్లు



వరినాట్లు వేస్తున్న కూలీలు

గార్ల: గార్ల పాకాల ఏటి పరివాహక ప్రాంత రైతులు మాత్రమే ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటి కింద సుమారు 1200ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు ట్రాక్టర్ల ద్వారా దుక్కులు దమ్ము చేసుకుంటున్నారు. ఇక మండలంలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నేటికీ నీళ్లు చేరలేదు. దీంతో చెరువులు, కుంటల కింద ఆయకట్టు రైతులు వరినార్లు పోసుకొని వర్షాలకోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు పడి చెరువులు కుంటలు నిండితేనే వరినాట్లు పడే అవకాశం ఉంది. మండలంలో 80శాతం మంది రైతులు చెరువులు, కుంటలపై ఆధారపడి వరిపంటలు పండిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ చెరువుల్లోకి నీళ్లు రాలేదు.

సంక్షిప్త సమాచారం

నేడు జంగిలిగొండలో రైతు సదస్సు

మహబూబాబాద్ రూరల్: మల్యాల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో మండలంలోని జంగిలిగొండ రైతు వేదికలో మంగళవారం రైతు సదస్సు ఏర్పాటు చేశామని మల్యాల కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.క్రాంతికుమార్ సోమవారం తెలిపారు. రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బంద్ విజయవంతం

కొత్తగూడ: జీఓ నంబర్ 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు తలపెట్టిన ఏజెన్సీ మండలాల బంద్ సోమవారం విజయవంతమైంది. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి మాట్లాడుతూ జీఓ నంబర్ 49తో ఆదివాసీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, సందీప్, నర్సింగరావు, జంపయ్య, సుధీర్, భిక్షం పాల్గొన్నారు.

భూమి విక్రయంపై ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ సమీపంలో గల తమ భూమిని కొందరు వ్యక్తులు ప్లాట్లు చేసి అక్రమంగా విక్రయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ ఖాన్ సోమవారం తెలిపారు.

సదస్సును జయప్రదం చేయాలి

మరిపెడ: ఈనెల 23న తొర్రూరులోని బాలాజీ గార్డెన్‌లో నిర్వహించే వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ సంఘాలు, అనుబంధ సంఘాల సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఐనాల వెంకన్న, టౌన్ అధ్యక్షుడు బోడ ధర్మా, జాటోతు లాలు, ఏడెల్లి వెంకన్న, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

బయ్యారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాజన్న, ఉపేందర్, మధు, వెంకన్న పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కొత్త పింఛన్లను మంజూరు చేయాలంటూ మున్సిపల్ పరిధి జ్యోతిరావుపూలే సెంటర్‌లో ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, బోడ వీరన్న, వీరస్వామి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో సోమవారం ఎమ్మెల్సీ రవీందర్‌రావును వెలమ సంక్షేమ సంఘం అసోసియేషన్ సభ్యులు కలిసి సభ్యత్వం అందజేశారు. అనంతరం ఫార్మసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సంపత్‌రావును ఎమ్మెల్సీ సన్మానించారు. కార్యక్రమంలో పోనుగోటి రామకృష్ణారావు, లక్ష్మణ్ రావు, సురేష్‌రావు, సతీష్‌రావు, రాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పనిగంటల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీయూసీఐ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి రవి పిలుపునిచ్చారు. సోమవారం డివిజన్ కేంద్రంలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్వపల్లి, శ్రీరామ్, పుల్లయ్య, రామస్వామి, మురళీ, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

మహబూబాబాద్ రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రంథాలు, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై జిల్లా కేంద్రంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రచార ప్రబోధానంద యోగీశ్వరుల వారి ఆశీస్సులతో జరిగిన ప్రచార కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి, కృష్ణ, వీరస్వామి, సుధాకర్, రాజలింగం, రజిత, లలిత, పాపక్క, హేమలత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

గార్ల: ఓ వ్యక్తి ఇంట్లోని గృహోపకరణాలకు నిప్పు పెట్టడంతో గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమైన సంఘటన సోమవారం గార్లలో చోటుచేసుకుంది. గార్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి పక్షవాతంతో బాధపడుతున్నాడు. భార్య ఇంట్లో లేని సమయంలో భర్త ఇంట్లోని గృహోపకరణాలకు నిప్పు పెట్టి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఇరుగుపొరుగు వారు చూసి ఇంటి నుంచి మంటలు వస్తున్నాయని భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చేసరికి అప్పటికే ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఇట్టి విషయంపై ఎస్సై రియాజ్‌పాషాను సాక్షి వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రవినాయక్‌ను కలిసిన భరత్‌కుమార్

మరిపెడ రూరల్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి గుగులోతు రవినాయక్‌ను మరిపెడ మండలం తానంచర్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు తేజావత్ భరత్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశా జుజీ. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపాడు. గిరిజన సమాజ అభ్యున్నతికి మార్గదర్శకుడిగా నిలువాలని భరత్‌కుమార్ ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ



బోనాలతో మహిళలు

కురవి: మండలంలోని రాజోలు శివారు గుండ్రాతిమడుగు(స్టేషన్) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కామాఖ్య అమ్మవారి ఆలయంలో సోమవారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాల పర్వదినోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి ప్రతాప్‌నాథ్ గురూజీ, ఆలయ కమిటీ సభ్యులు దేవత్ కబీర్, మాలి వీరన్న, రుడావత్ మోహన్ పాల్గొన్నారు.